క్లుప్తంగా

ముంపులో నారుమడులు



రెల్లుగెడ్డలో ముంపు నీటిలో నారుమడులు

అల్లవరం: నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దేవగుప్తం, డి.రావులపాలెం, రెల్లుగెడ్డ, అల్లవరం, గోడిలంక, తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో నారుమడులు ముంపునకు గురయ్యాయి. అనేక చోట్ల ముంపు నీరు దిగే దారి కరవై నారు మడుల్లోని నారు కుళ్లిపోతుంది. నారు మడులను కాపాడుకోవడానికి రైతులు మోటార్లు, గుల్లలతో నీటిని బయటకు తోడే ప్రయత్నం చేస్తున్నారు. అయితే రాత్రి వేళల్లో వర్షం ఎక్కువగా కురుస్తుడడంతో మళ్లీ నారు మడులు మునిగిపోతున్నాయి. మండలంలోని ప్రధాన డ్రెయిన్‌లో ముంపు నీరు స్తంభించడంతో నారు దక్కే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



ఎస్.యానంలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ సిబ్బంది సోమవారం గ్రామంలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో మానవహారం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

శాంతి ఆశ్రమంలో అన్నసమారాధన



పల్లం శాంతి ఆశ్రమంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కాట్రేనికోన: మండలంలో పల్లం పంచాయతీలోని శాంతి ఆశ్రమంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి శివారు రాఘవులుపేటకు చెందిన పాలెపు రాంబాబు, లక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో ఈ అన్న వితరణ కార్యక్రమం జరిగింది. ముందుగా శాంతి ఆశ్రమం పీఠాధిపతి మల్లాడి సత్యానందం ఆధ్వర్యంలో గురు సమారాధన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

శ్రమ శక్తి అవార్డులను పునరుద్ధరించాలి



మంత్రి సుభాష్‌కు వినతి పత్రం అందిస్తున్న రాధాకృష్ణ

అమలాపురం టౌన్: ఉత్తమ కార్మికులకు గౌరవంగా అందించే శ్రమ శక్తి అవార్డులను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఉభయ తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుత్తుల వెంకట రాధాకృష్ణ వినతి పత్రం అందించారు. సోమవారం ఉదయం అమలాపురంలో మంత్రి సుభాష్‌ను కలిసి పలు కార్మిక సమస్యలపై మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేయాలని కోరారు.

మాజీ మంత్రి వేణుకు పరామర్శ



సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మండలానికి చెందిన పలువురు నాయకులు రామచంద్రపురంలోని ఆయన స్వగృహంలో సోమవారం పరామర్శించారు. రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, వీరవెల్లి చిన్నబాబు, రాయపురెడ్డి నాగు తదితరులు వేణు తల్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉప్పలగుప్తంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెడుతున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ



అల్లవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

సంక్షేమ రథ సారథి వైఎస్సార్

- మాజీ మంత్రి పినిపే విశ్వరూప్
- ఘనంగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు
- జన హృదయ నేతకు వాడవాడలా నీరాజనాలు

అమలాపురం టౌన్: పేదల అభివృద్ధే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో సంక్షేమ రథ సారథిగా నిలిచిపోయారని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని గ్రామగ్రామాన వైఎస్సార్ సీపీ నేతలు, అభిమానులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమలాపురంలోని హైస్కూలు సెంటరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లతో కలిసి మాజీ మంత్రి విశ్వరూప్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ స్వర్గీయ వైఎస్సార్ పాలనలో బడుగు బలహీన వర్గాల వారికి పెద్ద పీట వేసి సంక్షేమ ప్రదాతగా ప్రజల హృదయాల్లో నిలిచారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ, రైతులకు ఉచిత కరెంట్ తదితర పథకాలను అమలుచేసి చిరంజీవిగా నిలిచారన్నారు. కూటమి నేతల బూటకపు హామీలతో వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోయినా 40 శాతం ఓట్లు సాధించిందన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ నేతృత్వంలో ఎప్పుడూ ప్రజల పక్షానే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతామని చెప్పారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్‌లు మాట్లాడుతూ చంద్రబాబు అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేశారన్నారు. ఆడ పిల్లలకు నెలా నెలా ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీల డొల్లతనాన్ని ప్రజలు త్వరలోనే తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, అమలాపురం రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, అమలాపురం, అల్లవరం మండల పరిషత్ అధ్యక్షులు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, అమలాపురం, అల్లవరం జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, కొనుకు గౌతమి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వంటెద్దు వెంకన్నాయుడు, ఉండ్రు బాబ్జి, కుడుపూడి భరత్ భూషణ్, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, యండమూరి గంగ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: మహనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని స్థానిక పోలమ్మ చెరువు వద్ద ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహానికి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కర్రివాని రేవు, అన్నంపల్లి, పదవ మైలు సెంటర్, సీహెచ్ గున్నేపల్లి, గేదెల్లంక, అయినాపురం గ్రామాల్లో మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ మహానేత రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలు సమయం ఇద్దామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పెయ్యల చిట్టిబాబు, నడింపల్లి సూరిబాబు, కాశి బాలమునికుమారి, నేల కిశోర్, కోలా బాబ్జి, జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, బొంతు సత్య శ్రీనివాస్, చింతా నాగమునీంద్రరావు, రాయపురెడ్డి జానకిరామయ్య, వేటుకూరి బోసు రాజు, సరిపెల్ల రామకృష్ణంరాజు, కోన శ్రీనివాసరావు, టి.శాంతి సుధ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం హైస్కూలు సెంటరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్



అమలాపురంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కేక్‌ను కట్ చేస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్ తదితరులు

అల్లవరంలో..

అల్లవరం: అపర భగీరథుడు, ఆరోగ్య ప్రదాత, స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణయుగమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో కోడూరుపాడు సెంటర్లో స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీలు గుబ్బల రంగనాథస్వామి, పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, తిక్కా ప్రసాద్, నాతి శ్రీనివాసరావు, పరమట శ్రీను, ఉండ్రు సుదర్శనరావు, దొమ్మేటి శ్యాంప్రకాష్, దొమ్మేటి సురేష్, వాసంశెట్టి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని స్థానిక చెరువుగట్టు సెంటర్, సంతపేట సెంటర్లలో ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక 30 పడకల సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లను అందజేశారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కోరంగి శ్రీ దుర్గా మల్లేశ్వర వృద్ధుల, అనాథ బాలల ఆశ్రమం, తాళ్లరేవు క్రీం కాంపౌండ్‌లోని చిన్నారులకు అన్నదానం చేశారు. ఇంజరం సర్పంచ్ ముద్దన ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ కిరణ్‌కుమారి, చంటి, పెంకే అర్జున్, కాగిత రాజు, కూరాటి వాసు తదితరులు వారికి భోజనాలు వడ్డించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, దడాల జగదీశ్వరరావు, కాశి లక్ష్మణస్వామి, వెంటపల్లి వాసంతి, రేవు మల్లీశ్వరి, మట్టపర్తి లోవరాజు, యర్రంనీడి అప్పారావు, బల్ల సంధ్యారాణి, కొల్లు శ్రీను, పెట్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి, గోపవరం, ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం ఉప్పలగుప్తంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌లు కడమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, బొద్దు బుజ్జి, కుంచే రమణారావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాలసుబ్రహ్మణ్యం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు పోతుమూడి కొండబాబు, యనమదల పల్లంరాజు, యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరంలో..

ఐ.పోలవరం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎదుర్లంక, పాత ఇంజరం గ్రామాల్లో ఉన్న నిలువెత్తు రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు ఎంపీపీ మోర్త మిరియాం జ్యోతి ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరాఘవులు, వడ్డి గౌతమ్, ముదునూరి రాజవర్మ, పండు విజయ్‌కుమార్, కుమారపల్లి శ్రీను, కొండేపూడి కృపావరప్రసాదరావు, చింతా ధర్మరాజు, చెల్లి రమేష్, లంక శ్రీను, దుగ్గపాటి సత్యనారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు. మురముళ్లలో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి సర్పంచ్ కాదా రాజబాబు, దేవస్థానం మాజీ చైర్మన్లు పెన్మత్స వాసురాజు, కె.గంగబాబు తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు. కొమరగిరి పార్టీ కార్యాలయంలో ఏలూరి ఆదినారాయణ, సకిలే వెంకటేశ్వరరావు, కృష్ణ తదితరులు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.

బండారులంకలో..

అమలాపురం రూరల్: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు బండారులంకలో ఘనంగా నిర్వహించారు. దంగేటివారిపాలెం సెంటర్‌లో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలేపు నాగ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, దంగేటి రుద్ర, జాన్ గణేష్ తదితరులు మహానేతకు ఘన నివాళులర్పించారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోనలో మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపీపీ పాలెపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, నాతి సత్యనారాయణ, ఏడిది చక్రపాణిరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లంకుర్రులో సర్పంచ్ నాతి అలివేణి, కందికుప్పలో సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి, చెయ్యేరులో నడింపల్లి సూరిబాబుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు జరుపుకున్నారు.

వైఎస్సార్ సహకారం మరువలేనిది

యానాం: నియోజకవర్గానికి మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని స్థానిక బొటానికల్ గార్డెన్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి యానాంకు గతంలో ఇచ్చిన సాగు, తాగునీటి కంటే ఎక్కువ క్యూసెక్కుల నీటిని కేటాయించారన్నారు. ధవళేశ్వరం నుంచి పైపులైను నిర్మాణం, 55 ఎకరాల తాగునీటి చెరువులకు భూమిని ఆంధ్రా రైతుల నుంచి ఇచ్చేలా జీఓ జారీ చేయడం వంటివి మరువలేనివన్నారు. అనంతరం దరియాలతిప్ప, కనకాలపేట, మెట్టకూరు, గిరియాంపేట, సావిత్రినగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది రైతులను ఘనంగా సత్కరించి, నూతన దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గిడ్ల చంద్రరావు, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, పెండెం సూర్యప్రకాష్, గూటం శివగణేష్, తిరుకోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి



పాతయింజరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు



తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



మురముళ్లలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మురముళ్లలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



పల్లంకురులో వైఎస్సార్ జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ నాతి అలివేణి

నానిరాజుకు విశ్వరూప్ పరామర్శ



నానిరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకుని స్థానిక చల్లావారి వీధిలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. విశ్వరూప్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, గొవ్వాల రాజేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా ప్రధాన, అనుబంధ కమిటీల నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కముజు రమణ, సుంకర సుధ, కుడుపూడి భరత్ భూషణ్, ఈతకోట శ్రావణ్‌కుమార్ తదితరులు నానిరాజును పరామర్శించారు.

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మామిడిపల్లి రాంబాబు కుటుంబాన్ని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం పరామర్శించారు. రాంబాబు తల్లి గంగారత్నం చిత్రపటానికి విశ్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వరూప్‌తో పాటు అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కల్వకొలను ఉమ, బోణం అప్పారావు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ గంధం రామం తదితరులు రాంబాబును పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు.

అల్లవరం: రెల్లుగడ్డలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మాజీ సర్పంచ్ నడింపల్లి కుమారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం పరామర్శించారు. రెల్లుగడ్డలోని ఆమె నివాసంలో కుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వరూప్ వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, చెల్లుబోయిన శ్రీను, సర్పంచ్ నడింపల్లి వాసురాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కాశే సత్యనారాయణ, ఉండ్రు వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

రోడ్డు, డ్రైనేజీ వసతులు కల్పించాలని నిరసన



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జనుపల్లి కాలనీవాసులు

అమలాపురం రూరల్: జనుపల్లి పంచాయతీలో మెట్ల రామలక్ష్మి కాలనీకు 25 ఏళ్లుగా రోడ్డు, డ్రైనేజీ, తాగు నీటి వసతులు కల్పించలేదని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సదరు కాలనీవాసులు నిరసన తెలియజేవారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నిరసనలో కాలనీవాసలు నక్కా శ్రీలక్ష్మి, మంగతాయారు, రత్నం, గెద్దం గంగా భవాని పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చలు

యానాం: నియోజకవర్గ శివారు సెల్డమ్ ఫార్మాసూటికల్స్ ఫ్యాక్టరీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మహిళా కార్మికుల ఏకపక్ష తొలగింపుపై చర్చించామన్నారు. ఫ్యాక్టరీ ఎండీ మూర్తి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారన్నారు.

మెరిట్ జాబితా విడుదల

యానాం: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) డిగ్రీ కోర్సుకు సంబంధించి అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు సెంటాక్ కోఆర్డినేటర్ అమన్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెంటాక్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఈ నెల 10వ తేదీలోగా రిజర్వేషన్ గల అభ్యర్థులు కొత్తగా తీసుకున్న సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. అభ్యర్థుల దరఖాస్తుల వెరిఫికేషన్ స్టేటస్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

గల్ఫ్ ఏజెంట్లు మోసం చేశారంటూ ఫిర్యాదు

అమలాపురం రూరల్: తమ కుమారుడు ఉండ్రాజవరపు సురేష్‌ను గల్ఫ్ ఏజెంట్లు మోసం చేసి రూ.లక్ష తీసుకుని విజిట్ వీసా మీద మస్కట్ పంపించేశారంటూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు పి.గన్నవరం మండలం నాగులంక గ్రామానికి చెందిన బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేశారు. తన కుమారుడు సురేష్ మస్కట్ వెళ్లిన తరువాత మోసపోయినట్లుగా తెలిసిందన్నారు. ఏజెంట్లు గుబ్బల శ్రీను, గుబ్బల ప్రసాద్‌ల వద్దకు వెళ్లి తన కుమారుడిని వెనక్కి రప్పించాలని అడిగితే దుర్భాషలాడుతూ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెంట్లపై చర్యలు తీసుకుని, తన కుమారుడిని వెనక్కి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వైస్ ఎంపీపీకి పార్టీ నాయకుల పరామర్శ

ఉప్పలగుప్తం: పితృ వియోగంతో బాధపడుతున్న మండల ఉపాధ్యక్షుడు సాదే శ్రీనివాసరావును మండలానికి చెందిన పలువురు నాయకులు మునిపల్లిలోని ఆయన స్వగృహంలో సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు తండ్రి సాదే నారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు, ఎంపీటీసీ సభ్యులు కొంకి ఏడుకొండలు, వంగా గిరిజకుమారి, దేశంశెట్టి నాగ రత్నకుమారి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు తదితరులున్నారు.

ఎస్‌ఐ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

తాళ్లరేవు: తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడు శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు దోషులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.